ప్రజాశక్తి
సోమవారం 2 అక్టోబర్ 2023 5
శ్రీ సత్యసాయి





భూస్వాధీన పోరాట కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

జోరుగా కల్తీకల్లు అమ్మకాలు

డైజోఫామ్ మత్తులో మద్యంప్రియులు

మామూళ్లలో జోగుతున్న ఎక్సైజ్ అధికారులు

అనుమతులు 3 షాపులకు, వెలిసింది 36





రూరల్ మండలంలో కల్తీ కల్లు తయారు చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

ఏదైనా చిన్న వ్యాపారం చేయాలంటే వివిధ శాఖల అనుమతులు అవసరం. ఇక మద్యం, కల్లు వ్యాపారాలు అంటే నిబంధనలు మరింత కఠిన తరంగా ఉంటాయి. నకిలీ మద్యం, కల్తీకల్లు ప్రాణంతకం కావడంతో వాటి విక్రయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇందుకోసమే ఏర్పాటైన ఎక్సైజ్ శాఖలో నిబంధనలు చాలా కఠినతరంగా ఉంటాయి. అనుమతులు లేకుండా ఒక్క సీసా మద్యం కానీ, కల్లు గాని విక్రయిస్తే కేసులు నమోదు అవుతాయి. విక్రయించిన వారు జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే విచిత్రం ఏమో కాని శ్రీ సత్యసాయి జిల్లాలో కల్తీ కల్లు ఏరులై పారుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.కల్తీ కల్లు తాగిన వారు డైజోఫామ్ మత్తులో అసుపత్రి పాలవుతున్నారు. దీనికి నిదర్శనం ఇటీవల పెనుకొండ నియోజక వర్గంలో జరిగిన సంఘటనలే. శ్రీ సత్య సాయి జిల్లాలోనే హిందూపురం, మడకశిర నియోజకవర్గాలు టాడి హబ్‌గా పేరొందాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 400 దాకా అధికారికంగా కల్లు దుకాణాలు ఉంటే అధికార పార్టీ నేతల కనుసన్నల్లో, అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిదుల కనుసన్నల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే నడిచే కల్లు దుకాణాలు వందల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాపారాల్లో అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులతో పాటు హిందూపురంలో ఓ ప్రజాప్రతినిధి సైతం ఉన్నారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించడానికి భయపడుతున్నట్లు తెలుస్తోంది. పరిగి మండలం గొల్లపల్లి వద్ద ఉన్న డిపో కల్తీకల్లు సిద్ధం చేసి హిందూపురం, పరిగి, లేపాక్షి మండలాల్లో దాదాపు 100 నుంచి 120 కౌంటర్లను ఏర్పాటు చేసి కల్లు వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ దుకాణాలపై దాడులు చేయడానికి అధికారులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. పరిగి మండలం బీచగానపల్లిలో ఓ వ్యక్తి 11 మందితో సోసైటిని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇతను అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే అందులో ముగ్గురిని తొలగించి, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకున్నట్లు తెలిసింది. ఇలా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నా ఎక్సైజ్ శాఖలో చలనం మాత్రం కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎవరికి ఎమైనా తమకు అందే మాముళ్ల సకాలంలో అందుతుంటే చాలు అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కల్తీ కల్లు తాగి పెనుకొండ నియోజకవర్గంలో ఎంతో మంది అసుపత్రి పాలయ్యారు.

చెట్లు తక్కువ కల్లు ఎక్కువ...

హిందూపురం, మడకశిర నియోజకవర్గాలను ఎక్సైజ్ శాఖ టాడి హబ్‌గా గుర్తించింది. అయితే ఈ ప్రాంతాల్లో చెట్లు తక్కువ ఉన్నా కల్లు వ్యాపారం మాత్రం 'మూడు చెట్లు 300 సీసాలు' అన్న చందంగా కొనసాగుతోంది. హిందూపురం ప్రాంతంలో ఈత చెట్ల వనాలు నామమాత్రం. ఎప్పుడో తాతలు, ముత్తాతల కాలంలో ఉన్న ఈత వనాలు ప్రస్తుతం కనుమరుగయ్యాయి. అక్కడక్కడ మాత్రం కొన్ని కనిపిస్తున్నాయి. అయితే ఎక్సైజ్ అధికారులకు మాత్రం ఎటుచూసినా ఈత వనాలే కనిపిస్తున్నాయి. ప్రశ్నిస్తే పాత రికార్డులు తెరిచి ఆ గ్రామంలో, ఈ గ్రామంలో ఈత వనాలు వున్నాయంటూ 50 సంవత్సరాల నాటి లెక్కలను నేటికి చూపిస్తూ పబ్బం గడుపుతున్నారు. ఈత చెట్లు లేకపోయినా ఈ ప్రాంతంలో భారీగా కల్లు ఉత్పత్తి జరుగుతోంది. ఈ కల్లు అంతా చెట్లనుంచి వచ్చిన కల్లు అనుకుంటే పొరబడినట్లే. ఇక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి కొందరు బడాకల్లు వ్యాపారులు చేరి నకిలీ కల్లు వ్యాపార కేంద్రాలు పెట్టుకున్నారు. ప్రమాదకరమైన క్లోరైల్, హైడ్రేడ్, డైజోఫామ్ తదితర రసాయనాలను ఉపయోగించి కల్లులాంటి తెల్లటి విషాన్ని తయారు చేసి మందుబాబులపై ప్రయోగిస్తున్నారు. దీనికి అలవాటుపడిన వారు తాగకుండా ఉండలేని పరిస్థితి. ఈ విషపు కల్లుతాగి క్రమ క్రమంగా ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు పోగొట్టుకుంటున్న అభాగ్యులు ఎందరో ఈ ప్రాంతంలో కనిపిస్తున్నారు. గతంలో లేపాక్షి మండలం తిమ్మగానిపల్లి గ్రామంలో కల్తీకల్లు దొరక్కపోవడంతో దాదాపు 10 మందికిపైగా పిచ్చివాళ్ళుగా మారిపోయి ఇందులో ఒక వ్యక్తి కాల్చుకొని చనిపోయిన సంఘటన చోటు చేసుకుంది. మరికొంతమంది వింత వ్యాధితో బాధపడుతున్న సంఘటనలు సైతం వున్నాయి. ప్రతినెల కల్లు సాంపుల్స్ ప్రయోగశాలకు పంపిస్తున్నా అంతా సక్రమంగానే ఉన్నాయంటూ నివేదికలు వస్తున్నాయంటే కల్తీకల్లు మాఫియా ఏ స్థాయిలో మేనేజ్ చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైన సెబ్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా దాడులు చేసి అనుమతులు లేని కల్లు దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సుంది.

సరిహద్దుల్లో అధిక విక్రయాలు

జిల్లా అత్యధికంగా కర్నాటక సరిహద్దును పంచుకుంటోంది. ఎక్సైజ్ శాఖ పరిధిలో టిసిఎస్‌లు 59, గ్రూపు షాపులు 89, టి ఎఫ్ టి లు 177, దుకాణాలు 347 ఉన్నాయి. ఇవన్నీ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. గత సంవత్సరం రెన్యువల్ సందర్భంగా పుట్టపర్తి లోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద కల్లు దుకాణాల కోసం పోటీపడే వారితో జాతరను తలపించింది. ఏ కుగ్రామానికి వెళ్ళినా రెండు, మూడు దుకాణాలు కనిపిస్తున్నాయి. హిందూపురం, మడకశిర, ఆగలి, అమరాపురం, లేపాక్షి, చిలమత్తూరు, మడకశిర, పరిగి, రొద్దం, గోరంట్ల, అమడుగురు, తనకల్లు వరకు కర్నాటక సరిహద్దు ప్రాంతం ఉంది. కర్నాటకలో కల్లు దుకాణాలు లేకపోవడంతో జిల్లాలో ఉన్న ఈ దుకాణాలకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఈత చెట్టు నుంచి ఐదు లీటర్ల కల్లు వస్తే దీనికి కల్తీ చేసి 50 లీటర్లు తయారు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రాణాంతక ముత్తు పదార్థాలతో కల్లు తయారు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కల్లు తయారీదారులు ప్రాంతాల వారీగా విభజించుకుని ఈత చెట్ల నుంచి కొంత కల్లును సేకరించి మత్తు పదార్థాలను కలిపి తయారుచేస్తున్నారనిది అక్షర సత్యం. జిల్లా సరిహద్దుల్లో ఉన్న కల్లు దుకాణాల్లో సగటున ఒక్కో దుకాణం నుంచి రూ.20వేల నుంచి 60 వేల రూపాయల దాకా విక్రయాలు సాగుతున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సరిహద్దు దుకాణాల వద్ద జనాన్ని బట్టి కల్తీకల్లు క్షణాల్లో తయారు చేస్తున్నారు. కల్లు తాగినవారు చనిపోయినా, అస్వస్థతకు గురైనా ఎవరు పట్టించుకోవడం లేదు. ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు శాంపిల్ సేకరించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది సోమందేపల్లి మండలం ఈదుల బలాపురం వద్ద వలస కార్మికులు కల్లు తాగి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. మహారాష్ట్రకు చెందిన ఓ కార్మికుడు మృతిచెందాడు. దీనిని అధికార పార్టీకి చెందిన ఓ నేత పంచాయతీ చేసి పాము కాటుతో చనిపోయినట్లు చిత్రీకరించి ప్రచారం చేశారని ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. నాలుగేళ్ల క్రితం లేపాక్షి మండలం తిమ్మగానపల్లి, సిరివరం, మానింపల్లిలో కొంతమంది కల్తీకల్లు తాగి మతిస్థిమితం లేకుండా ప్రవర్తించిన వైనం వెలుగులోకి వచ్చింది. ఇటీవల పెనుగొండ మండలం నాగలూరు, బండపల్లిలో 30 మంది కల్తీకల్లు తాగి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఎక్సైజ్ శాఖ అధికారులు శాంపిల్లు సేకరించి చేతులు దులుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా కల్తీ కల్లు తాగిన వారిలో చాలామంది మానసిక అనారోగ్యం బారిన పడుతున్నారు. అయినప్పటికీ అటు పాలకులు గాని ఇటు ఎక్సైజ్ అధికారులు గాని తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా సరిహద్దులో దుకాణాలు ఉదయం నుంచి రాత్రి వరకు కనిపిస్తున్నాయి. కల్లు విక్రయాలు ఆదాయ వనరులుగా మారడంతో వాటికోసం ఇటీవల ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నేతల జోక్యం పెరిగింది. కల్తీ కల్లు నిరుపేదల ప్రాణాలను హరిస్తుంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు కల్తీకల్లు విక్రయాలకు అడ్డుకట్ట వేయాలన్న డిమాండ్ జిల్లాలో ఎక్కువగా వినిపిస్తోంది.



రోడ్డు పక్కన జరుగుతున్న కల్తీకల్లు విక్రయం

విలువైన భూమి పేదలకు ఇవ్వకూడదా..?

భూస్వాధీన పోరాటంలో సిపిఎం సూటిప్రశ్న

ప్రజాశక్తి - చిలమత్తూరు

ప్రభుత్వ భూమి అంటే పేదలకు సంబందించిన భూమి కదా? విలువైన భూమి అయితే పేదలు ఇళ్ల నిర్మాణాలు చేసుకోవడానికి అర్హులు కాదా..? అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి ప్రశ్నించారు. చిలమత్తూరు మండలంలో జరుగుతున్న భూస్వాధీన పోరాటంలో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారితో పాటు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి ఎల్ నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్, వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక రెవెన్యూ అధికారులు అవగాహన లోపంతో చేసిన తప్పుకు పేదలు గత నాలుగేల్లుగా ఇళ్లు లేక బిక్కుబిక్కు మంటు గుడిసెలలో జీవించాల్సిన దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున రెవెన్యూ అధికారులు చూపిన భూమి కోర్టు కేసులో ఉందని అక్కడ నిర్మాణం కుదరదని అంటున్నారని అన్నారు. దీంతో పేదలు ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణాలకోసం గుడిసెలు వేసుకుంటే విలువైన స్థలం కాబట్టి ఇవ్వలేమని అంటున్నారని, మరోచోట లేఅవుట్ వేసి పట్టాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలు చేసివ్వమంటే ఆ పని చేయలేకున్నారని విమర్శించారు. ఇక పేదలు ఎక్కడ నివాసం ఉండాలో చెప్పాలని ప్రశ్నించారు. భూస్వాధీన పోరాటంలో పాల్గొంటున్న నాయకులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసేందుకు కుట్ర చేస్తున్నారని అదే జరిగితే దీనిన జిల్లావ్యాప్త ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. పేదలు న్యాయ బద్దంగా శాంతి యుతంగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని జీవనం చేసుకుంటున్నారని వాటిని తొలిగించాలంటే ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్ల పట్టాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఈ భూమిలో నీటి సౌకర్యం కోసం చందాలు వేసుకొని బోరు వేసుకుంటామని స్పష్టం చేశారు. అరెస్టు చేయడం,భయభ్రాంతులకు గురుచేయడం మాని కనీస వసతులు కల్పించేందుకు అదికారులు కృషి చేయాలని సూచించారు. ఒక వేళ బలవంతంగా గుడిసెలు తొలిగిస్తే పేదలకు ఇళ్లు ఇచ్చేవరకు ప్రభుత్వ కార్యాలయాలు ముందే తిష్ట వేస్తామని హెచ్చరించారు. కార్యాయాలను పేదల నివాసాలుగా మారుస్తారో లేక శాంతి యుతంగా గుడిసెలు వేసుకున్న చోట జీవనం చేసుకోమంటారో అధికారులు తేల్చుకోవాలని చెప్పారు. ఈ భూమిని పేదలు చేతికి ఇవ్వకుండా బడాబాబులు చేతికి అందించేందుకు ప్రభుత్వాలు పని చేస్తుంటాయనిదానిని కట్టడి చేస్తూ ఇది పేదలు భూమి అని గుర్తు చేసే పనిని కమ్యునిస్టు పార్టీలు చేస్తుంటాయని అన్నారు. పేదలకు సెంటు భూమిని ఇవ్వాలంటే కడుపు మండే ప్రభుత్వాలకు పెట్టుబడిదారులుకు మాత్రం వేల ఎకరాలు ధారదత్తం చేయడానికి చివాతీలు వేస్తుంటాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కమిటి సభ్యులు గంగాధర్, సదాశివరెడ్డి, చందు, శివ, చరణ్, మణిస్వామి, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

జాయింట్‌కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్



వీధులు శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రతి ఒక్కరూ పారిశుధ్యంపై దృష్టి సారించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. ఆదివారం స్వచ్ఛత హి సేవలో భాగంగా పట్టణంలోని చిత్రావతి బ్రిడ్జి నుంచి బైపాస్ రోడ్డు వరకు అధికారులు ప్రజాప్రతినిధులు చీపురులు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. జెసి తోపాటు డిఆర్ఓ కొండయ్య, మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్ మాతాంగి తిప్పన్న, ఆర్‌డిఓ భాగ్యరేఖ, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్ భాస్కర్ తో పాటు పారిశుధ్యకార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత గల భారతావని సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శప్రభుత్వ కార్యాలయాలు వైద్యశాలలు విద్యాలయాలు ప్రైవేట్ సంస్థలు కూడా తమ తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్వయంగా అధికారులే చీపురు పట్టి పారిశుధ్యం పై పనిచేయడం పట్ల ప్రజలు కూడా ఆలోచనలో పడతారని ఆరోగ్యవంతమైన జీవనం గడపాలంటే పరిశుభ్రత ప్రాముఖ్యం వహిస్తుందని జెసి తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

దుబాయి కరెన్సీ మార్పిడి పేరుతో 8. లక్షలు టోకరా..!

తమ పరిధిలోకి రాదంటూ బాధితులను తిప్పి పంపిన బత్తలపల్లి, అనంతపురం పోలీసులు

ప్రజాశక్తి బత్తలపల్లి



బత్తలపల్లి పోలీసుస్టేషన్ వద్ద బాధితులు

తమ వద్ద దుబాయి కరెన్సీ ఉంది మార్చుకుని సొమ్ము చేసుకోవాలని దంపతులను అగంతకుడు బురిడీ కొట్టించి రూ. 8లక్షలతో ఉడాయించిన సంఘటన మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. ఈఘటనకు సంబందించి బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు...

ముజహర్ అహ్మద్ అనే వ్యక్తికి అనంతపురం పట్టణంలోని పాతూరు తాడిపత్రి బస్టాండ్ వద్ద మున్సిపల్ కాంప్లెక్స్‌లో చెప్పుల దుకాణంతోపాటు కూల్ డ్రింక్ దుకాణం ఉంది. ఈ నేపథ్యంలో సలీం అనే పేరుతో ఓ వ్యక్తి ముజహర్ అహ్మద్‌తో పరిచయం పెంచుకున్నాడు. 'మిమ్మల్ని చూస్తే చాలా మంచివారుగా ఉన్నా'రంటూ నమ్మబలికాడు. తమది బీహార్ రాష్ట్రమని, తాము పెయింటింగ్ వర్క్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని చెప్పాడు. తన వద్ద దుబాయి కరెన్సీ ఉందని, వాటిని మార్చుకుంటామంటే ఇస్తానని చెప్పాడు. రూ. 8 లక్షలు ఇస్తే రూ.16 లక్షలు విలువ చేసే దుబాయి కరెన్సీని అప్పగిస్తానని ఆశ చూపాడు. దీంతో ముజహర్ అహ్మద్ ఆశకు పోయాడు. 'మీ వద్దనున్న నోట్లు ఇవ్వండి వాటిని పరీక్షించుకుంటాన'ని అడిగాడు. దీంతో సలీం ఆయనకు దుబాయి నోటు ఇవ్వగా దానిని బెంగుళూరులో తనకు తెలిసిన వ్యక్తిని ముజహర్ అహ్మద్ చూపించాడు. ఆయన ఈ నోటుకు భారత్ కరెన్సీ రూ. 16లు వస్తుందని చెప్పాడు. దీంతో ముజహర్ అహ్మద్‌కు సలీంమీద కొంత నమ్మకం కలిగింది. అయినా దుబాయి కరెన్సీ ఎలా వచ్చిందని సలీంను ప్రశ్నించగా తాను, తన భార్య ముంబైలో వృద్ధురాలి ఇంటిలో పనిచేస్తుండేవారమని, ఇటీవల ఆమె మృతిచెందడంతో ఆమె కుమారుడు తమకు ఈ డబ్బు ఇచ్చాడని నమ్మబలికాడు. తనకు దుబాయి కరెన్సీ పూర్తిగా చూపితేనే నమ్ముతానని ముజహర్ అహ్మద్ చెప్పడంతో బత్తలపల్లికి వస్తే చూపుతానని సలీం సమాధానమిచ్చాడు. దీంతో మూడు రోజుల క్రితం దీంతో ముజహర్ అహ్మద్ బత్తలపల్లికి వచ్చాడు. ఆసందర్భంలో సలీం ముజహర్ అహ్మద్‌ను జన సంచారం లేని ప్రదేశంలోకి తీసుకెళ్లి దుబాయి కరెన్సీని చూపాడు. దీంతో ముజహర్ అహ్మద్‌కు పూర్తి నమ్మకం కలిగింది. అక్కడ నుంచి అనంతపురానికి వచ్చిన ముజహర్ అహ్మద్ డబ్బులు పోగుచేసుకున్నాడు. రూ. 8 లక్షలు తీసుకొని బత్తలపల్లికి వస్తున్నట్లు సలీంకు సమాచారం అందించాడు. అందులో భాగంగా ముజహర్ అహ్మద్ డబ్బులు తీసుకుని తన భార్య ఫరీదాతో కలసి ఆదివారం బత్తలపల్లికి ద్విచక్రవాహనంలో వచ్చాడు. సలీం వీరిని బత్తలపల్లిలోని ఎస్సీ కాలనీ వద్దకు రావాలని సూచించాడు. ఆ ప్రదేశంలో సీసీ కెమెరాలు లేవు. అక్కడకు మజాహర్ అహ్మద్ తన భార్య పరీదాతో కలసి ద్విచక్ర వాహనంలో వచ్చి రూ. 8 లక్షలు సలీంకు అందజేశారు. ఆ సమయంలో సలీం, మరో మహిళ ముజహర్ అహ్మద్ దంపతులకు ఓ బ్యాగు ఇచ్చారు. దుబాయి కరెన్సీ ఉన్న మూట బ్యాగులో ఉందని చెప్పి వారిచ్చిన రూ. 8 లక్షలు తీసుకుని అక్కడ నుంచి కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్లి ద్విచక్ర వాహనంలో ఉడాయించారు. ఐదు నిమిషాల తర్వాత ముజహర్ అహ్మద్ దంపతులు బ్యాగు తెరిచి చూసి అవాక్కయ్యారు. అందులో పాత న్యూస్‌పేపర్లు ఉండటంతో లబోదిబోమంటూ బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమకు జరిగిన మోసాన్ని వివరించారు. సలీం అనే వ్యక్తికి తాము డబ్బు ఇచ్చిన దృశ్యాన్ని వారికి తెలియకుండా వీడియో తీసుకున్నామని చెప్పారు. అంతా విన్న పోలీసులు అనంతపురం పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. దీంతో బాధితులు అనంతపురం వెళ్లి అక్కడ పోలీసులను కలిశారు. అయితే ఘటన జరిగింది బత్తలపల్లిలో కాబట్టి అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో బాధితులు తాము ఎవరి వద్దకు వెళ్లాలి.. ఎవరు న్యాయం చేస్తారో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుబ్బిరెడ్డిపల్లిలో ప్రబలిన అతిసార



హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం


హిందూపురం రూరల్ మండలం కగ్గల్లు పంచాయతీ పరిధిలోని సుబ్బిరెడ్డి పల్లిలో అతిసార ప్రబలింది. గ్రామంలో ఒక్క సారిగా కొంత మందికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో గ్రామానికి చెందిన 15 మంది తీవ్ర అస్వస్థతకు గురై హిందూపురం జిల్లా అసుత్రికిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ అసుపత్రిలో గ్రామానికి చెందిన క్రిష్టప్ప, సంజీవప్ప, ఓబులమ్మ, ఆశ:్వర్థప్ప, చిన్న సంజీవప్ప, తిప్పన్న, సాకమ్మ, చంద్రిక, లక్ష్మిదేవమ్మ, నూర్జహాన్ తదితరులు చికిత్స పొందుతున్నారు. ఈసందర్భ:గా వారు మాట్లాడుతు తమ గ్రామంలో దాదాపు 150 కుటుంబాలు ఉన్నాయన్నారు. తమకు నీటి

అధికారుల ఇంటింటి సర్వే

సరఫరా చేయడానికి ఓవర్ హెడ్ ట్యాంకు ఉందని తరచు ఆ ట్యాంక్‌లో కాకులు ఇతర పక్షులు పడుతుంటాయాని, దీంతోనే తమకు వాంతులు, విరేచనాలు అయ్యాయని చెప్పారు. విషయం తెలిసిన వెంటనే ఎంపిడిఓ నరేంద్ర కుమార్‌తో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. అనంతరం ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించి వేడి నీటిలో కలుపుకుని తాగాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ నరేంద్ర కుమార్ మాట్లాడుతు వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రతి ఇంటిని సర్వే చేయించి, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే నీళ్ల ట్యాంక్‌తో పాటు పారిశుధ్యాన్ని మెరుగు పర్చామన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు రక్షణ

డిఎం హెచ్ఓ కృష్ణారెడ్డి





ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఎంతో రక్షణ కల్పిస్తుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎస్‌వి. కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తామన్నారు. వారికి చికిత్సలను అందించి, అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడే వారికి అధునాతన వైద్య సేవలు అందించడంతోపాటు ఆపరేషన్లు శస్త్ర చికిత్సలు నిర్వహించి సంబంధిత ఆసుపత్రులలో ఆపరేషన్లు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : శ్రీ సత్య సాయి జిల్లాలోఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి, సిబ్బంది కొరత ఏమైనా ఉందా..?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కొత్తగా నాలుగు మంజూరు కాగా, వాటిని ఏర్పాటు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నాం. రెండింటికి స్థల పరిశీలన కూడా చేసాం. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో 14మంది సిబ్బంది వున్నారు. ఎక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి లేని కేంద్రాలకు సిబ్బందిని బదిలీ చేశాం. సిబ్బంది కొరత కారణంగా ఇటీవల జిల్లాలో నోటిఫికేషన్ మంజూరు చేసి కొత్తవారిని తీసుకున్నాం.

ప్ర : డెంగీ, మలేరియా వ్యాప్తి చెందకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు ?

జ : గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో డెంగీ, మలేరియా తో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రాథమిక వైద్య సిబ్బందితో నిరంతరం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి శుకరవారం డ్రై డే.. ఫ్రై డేను పాటిస్తున్నాం. ఇందులో భాగంగా పట్టణ ప్రాంతాలలో మురుగు కాలువలు శుభ్రపరచి, బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేపట్టడం, దోమల వ్యాప్తి అరికట్టడానికి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లాంటివి చేపడుతున్నాం. నీటిలో ఉత్పత్తి చెందే డెంగీ దోమ వ్యాప్తి చెందకుండా గ్రామీణ ప్రాంతాల్లో నిలువ ఉంచిన నీటి తొట్టెలను, శుభ్రపరచడం, మురుగు నీటి గుంటలు పూడ్చి వేయడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నాం.

ప్ర : జిల్లాలో ఎన్ని జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు ?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 397 వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా 32 శిబిరాలు నిర్వహించే విధంగా చర్యలు చేపడుతున్నాం. పట్టణ ప్రాంతాలలో 18, గ్రామీణ ప్రాంతాలలో 379 శిబిరాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రజలకు ఏడు పరీక్షలను నిర్వహిస్తున్నాం. 18 సంవత్సరాల పైబడిన వ్యక్తులకు ఏ వ్యాధి ఉన్నా ఏడు పరీక్షలు నిర్వహించి, శిబిరాలలోనే వారికి వైద్య పరీక్షల నిర్వహించి, అవసరమున్న దీర్ఘకాలిక జబ్బులు కలిగిన వారికి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్యం అందించి వారి వ్యాధి నయం అయ్యే వరకు సంబంధిత ఆరోగ్య శాఖ పరిధిలో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నాం.

ప్ర : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎలాంటి చికిత్సలు అందుతున్నాయి?

జ : జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 18 సంవత్సరాలు పైబడిన వ్యక్తులకు దీర్ఘకాలిక వ్యాధులు బిపి, షుగర్, హిమోగ్లోబిన్, స్పోటెం, మలేరియా, డెంగీ, యూరిన్ టెస్ట్, తదితర ఏడు పరీక్షలను ఇంటింటికి వెళ్లి నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా ఎలాంటి వ్యాధులు ఉన్న వాటిని గుర్తించి. ప్రతి ఇంట్లో ఆరోగ్య సమస్యలను, తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు, శిబిరాలకు తరలించి చికిత్స అందిస్తున్నాం.

'104' సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

104 లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో 104 ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఇఎస్. వెంకటేష్‌తో పాటు 104 రాష్ట్ర ఉద్యోగుల కమిటీ సభ్యులు సుబ్రమణ్యం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీల మేరకు 104 ఉద్యోగులను ఆఫ్కాన్‌లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు స్థానిక ప్రదేశాలకు బదిలీ అవకాశం కల్పించాలన్నారు. గతంలో మాదిరి ఫుడ్ అలవెన్స్, ట్రావెల్ అలవెన్స్, వాహనంలో తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. 104 వాహనాల సేవలు గతంలో లాగే రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఉద్యోగులకు రావలసిన అన్ని సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నూతన కమిటీతో ఈ ఎస్ వెంకటేష్

జిల్లా నూతన కమిటీ ఏర్పాటు

ఈ సందర్భంగా 104 ఉద్యోగుల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా రాజు, అరుణ్, ప్రధాన కార్యదర్శిగా మోహన్ బాబు, సహాయ కార్యదర్శిగా బాబు, శ్రావణి, కోశాధికారిగా చలపతితో పాటు మరో పదిమందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

2024లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

వైసిపి జిల్లా అధ్యక్షులు శంకరనారాయణ, ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

2024 ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు శంకరనారాయణ, ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పట్టణంలోని శ్రీదత్త గార్డెన్స్‌లో ఆదివారం శంకరనారాయణ అధ్యక్షతన జిల్లా స్థాయి జెసిఎస్ మండల ఇన్‌ఛార్జులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శంకరనారాయణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సిఎం జగన్ లక్ష్యమైన 175 స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. జగనన్న ప్రభుత్వం ఎందుకు అవసరమో ప్రజలకు తెలియజేసే కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి, హిందూపురం నియోజకవర్గ సమన్వయ కర్త దీపిక మాట్లాడుతూ జెసిఎస్ మండల ఇన్‌ఛార్జులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జెసిఎస్ జిల్లా, రీజినల్ కోఆర్డినేటర్లు మారుతిరెడ్డి, చల్లా మధుసూదన్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకాన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ముందుంటామన్నారు. సమావేశంలో వివిధ మండలాల జెసిఎస్ ఇన్‌ఛార్జులు, కదిరి మున్సిపల్ ఛైర్మన్, ఎంపిపిలు, జడ్పిటిసిలు, మండల కన్వీనర్లు, పట్టణ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

సీనియర్ సిటిజన్లకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

ఓటు హక్కు ఉన్న సీనియర్ సిటిజన్లను గౌరవించి, సన్మానించే బృహత్తర కార్యక్రమానికి ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టిందని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ కార్తీక్ పేర్కొన్నారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యలయంలో ఆదివారం 80 ఏళ్ల పైబడిన కొందరు ఓటర్లను అధికారులు సన్మానించారు. జెసి మాట్లాడుతూ ప్రపంచ వృద్ధాప్య దినోత్సవం పురస్కరించుకొని వీరిని సన్మానించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహశీల్దార్ స్వర్ణలత పాల్గొన్నారు.


సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న ఇన్‌ఛార్జి జెసి కార్తీక్

తల్లిదండ్రులపై అశ్రద్ధ, నిర్లక్ష్యం తగదు : ఆర్‌డిఒ

ధర్మవరం టౌన్ : తల్లిదండ్రుల పట్ల అశ్రద్ధ, నిర్లక్ష్యం వద్దని ఆర్‌డిఒ తిప్పేనాయక్ సూచించారు. 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం' పురస్కరించుకొని ఆదివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో 80 ఏళ్లు పైబడిన పట్టణానికి చెందిన ఓటర్లు ఆర్.రామలక్ష్మమ్మ, శంకర ఎర్రమ్మలను ఆర్‌డిఒ ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను ప్రేమతో పలకరించి, ఆదరించాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ షేక్ కత్రిజన్ కుబ్రా, తహశీల్దార్ యుగేశ్వరీదేవి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని బండ్లపల్లి, బైరాపురం, పోతులకుంట, లోచర్ల గ్రామ సచివాలయాల్లో ఆదివారం వైసిపి నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ పార్టీలు, కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. శ్రేణులు విభేదాలు వీడి ఐకమత్యంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి, జడ్పిటిసి గంగాదేవిశంకర్, సర్పంచులు గీతాబాయి, మమత, గంగులమ్మ, కోఆప్షన్ సభ్యులు మున్వర్ బాషా, వైసిపి నాయకులు మాబాషా, సూరినందిరెడ్డి, అశోకరెడ్డి, నారాయణ స్వామి, అశ్వితరెడ్డి, యోగానందరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

వైసిపి మండల కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

నియోజకవర్గంలోని మండలాలకు వైసిపి అధిష్టానం నూతన కన్వీనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మడకశిర మండల కన్వీనర్‌గా చందకచెర్ల గ్రామానికి చెందిన రామిరెడ్డి, పట్టణ కన్వీనర్‌గా పుట్ట కామప్ప, గుడిబండ-డిఎల్ ఎంజారేగౌడ్, అమరాపురం-త్రిలోక్‌నాథ్, రొళ్ల-నరసింహారెడ్డి, అగళి-స్టూడియో శ్రీనివాసులును నియమించారు. దీంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం వెల్లివిరిసింది. పార్టీ కోసం తొలి నుంచి కష్టపడిన మమ్మల్ని మండల కన్వీనర్లుగా ఎన్నుకున్నందుకు వారు సిఎం జగన్, ఎమ్మెల్యే తిప్పేస్వామికి కతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మండల కన్వీనర్లు ఘనంగా సన్మానించారు. మడకశిర మండలంలో వైసిపికి, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి ఎల్లవేళలా అండగా నిలుస్తూ సేవలు అందిస్తున్న చందకచర్ల గ్రామానికి చెందిన రామిరెడ్డిని వరుసగా రెండవసారి మండల కన్వీనర్‌గా నియమించడం పట్ల మండల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. రామిరెడ్డి మాట్లాడుతూ రెండవసారి అవకాశం కల్పించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, పార్టీ అభివృద్ధికి, ఎమ్మెల్యే తిప్పేస్వామి శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.


మడకశిర మండల కన్వీనర్ రామిరెడ్డి

వై.జస్వితకు 'నాట్య మంజీర' పురస్కారం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి గ్రామానికి చెందిన వై.జస్విత(7) ఆదివారం తమిళనాడులో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలం దేవస్థానంలో 'నాట్య మంజీర' పురస్కారం అందుకుంది. 'సహస్ర ఆర్ట్స్ అకాడమీ మ్యూజిక్ డాన్స్ ఫెస్ట్ 2023' అరుణాచలేశ్వర నృత్య ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి పికె శేఖర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆల్ ఇండియా లెవెల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలు రాష్ట్రాల నుంచి విద్యార్థులు, కళాకారులు పాల్గొన్నారు. వై.జస్విత 'కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు' పాటకు నృత్యం చేసి సభికులను ఆకట్టుకోగా 'నాట్యమంజీర' పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. బాలిక ధర్మవరానికి చెందిన ప్రసాద్ వద్ద శిక్షణ పొందింది. ఇప్పటికే జస్విత నంది అవార్డుతో పాటు పలు ప్రశంసా పత్రాలు దక్కించుకుంది. పెడపల్లి ఉదయ్ కిరణ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 2వ తరగతి చదువుతోంది.


అవార్డు, ప్రశంసా పత్రంతో వై.జస్విత

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

'స్వచ్ఛత హి సేవ'లో డిఇఒ మీనాక్షి

ప్రజాశక్తి-కొత్తచెరువు

ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, డిఎల్‌పిఒ శివకుమారి తెలిపారు. 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులు, వాలంటీర్లు ప్లకార్డులు చేతపట్టి స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి ర్యాలీగా వెళ్లి రోడ్డుకు ఇరువైపులా పారిశుధ్యం పనులు చేపట్టారు. జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలు, విద్యాలయాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. గ్రామాల్లో ప్రజలు ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు నిర్వహించి పరిశుభ్రత పాటించాలని, లేకపోతే సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచి రాధా నాగరాజు, ఇఒఆర్‌డి సిద్ధారెడ్డి, ఎంఇఒ జయచంద్ర, మేజర్ పంచాయతీ కార్యదర్శి గోపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఓబులేసు, వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, పాపన్న, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఆర్టీసీ బస్టాండ్, డిపో ఆవరణలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు చీపుర్లు పట్టి శుభ్రం చేసి అనంతరం మొక్కలు నాటారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని డిపో మేనేజర్ మోతిలాల్ నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌ఛార్జి వెంకటేశులు, ఎడిసిలు సాహెబీ, దుర్గాప్రసాద్, నరసింహులు, సిస్టమ్ సూపర్‌వైజర్లు సుధాకర్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగార్జునరెడ్డి, రీజినల్ నాయకులు నరసింహులు, కుమార్, శీన, రామకృష్ణ, బాబు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధిలోని మోటుకపల్లిలో ఎంపిడిఒ అంజినప్ప ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు, బస్టాండ్ ఆవరణలో చెత్త ఊడుస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల్లో చెట్లు, చెత్త చెదారం వల్ల విషపురుగులు, దోమలు తీవ్రమై విష జ్వరాలు ప్రబలుతాయని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ సుబ్బారావు, డివిజనల్ పంచాయతీ అధికారి డి.అంజనప్ప, సర్పంచి, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని హస్నాబాద్ వార్డు కౌన్సిలర్ ఆసీఫ్‌వుల్లా ఆధ్వర్యంలో వార్డులో శ్రమదానం, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మెప్మా ఆర్‌పిలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. జీవన జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ముదిరెడ్డిపల్లి ప్రాంతంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో జీవన జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.నాగజ్యోతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. మాడల్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అంజలి, హరి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని మల్లాపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ రైతు విభాగం అధ్యక్షులు పాటూరి శంకరరెడ్డి, అతడి సోదరులు మండల అగ్రి అడ్వైజరీ కమిటీ మెంబెర్ పాటూరి లక్ష్మీరెడ్డి, సర్పంచి శివానంద, ఉప సర్పంచి శ్రీరాములు, మల్లికార్జున, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఎఎన్‌ఎంలు, పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని బాలాజీనగర్‌లో సిడిపిఒ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది, ప్రజలు గ్రామంలో డ్రైనేజీలు శుభ్రం చేయడం, ప్లాస్టిక్ కవర్లు వేరడం, రోడ్ల ఊడ్చి పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రొద్దం : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాలలో, పెద్దమంతూరు సచివాలయ పరిధిలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. కంబాలపల్లి, రెడ్డిపల్లి గ్రామాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో గ్రామంలో ఉన్న చెత్తను తొలగించి, మురుగు నీరు నిల్వ ఉన్న చోట అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సుజాత, అనురాధ, లక్ష్మి, ముత్యాలమ్మ, నాగలక్ష్మి, ఎంజెబి పాఠశాల ప్రిన్సిపల్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి బాబు, రెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల పరిధిలోని గేమేనాయక్‌తండాలో సర్పంచి మూడే కాంతమ్మ, ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా పంచాయతీలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి మూడే ఉత్తన్న నాయక్, గోపాల్ నాయక్, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రీన్ అంబాసిడర్లు, ప్రజలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : 'స్వచ్ఛత హి సేవ'లో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం, చామలగొంది, తదితర గ్రామాల్లో ప్రభుత్వ కార్యాల యాలు, పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొల గించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో నీటి తొట్టెలను శుభ్రం చేసుకుంటే దోమలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మోహన్‌నాయక్, రఫీ, స్వచ్ఛభారత్ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కంచిసముద్రం పంచాయతీ, దేవాలయం, కెజిబివి ఆవరణలో 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమం నిర్వహించారు. కెజిబివి విద్యార్థినులు ర్యాలీ నిర్వహించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ బాబు, ఇఒఆర్‌డి శివన్న, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ విజయకుమార్, వైద్యాధికారులు వెంకట చిరంజీవి, రాజ్‌కుమార్, పిహెచ్‌సి సిబ్బంది, కెజిబివి ప్రిన్సిపల్ నీలిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కొత్తచెరువులో రోడ్లు శుభ్రం చేస్తున్న అధికారులు

బత్తలపల్లి : మన చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామని ఇఒఆర్‌డి దివాకర్, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ అదినారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిసరాల్లో చెత్తను, ముళ్లపొదలను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నారాయణస్వామి, అశోకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, జాతీయ రహదారిపై నాలుగు కూడళ్ల సర్కిల్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు చీపుర్లు చేతపట్టి శుభ్రం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి తిరుమల సేవేనాయక్, పంచాయతీ సెక్రటరీ మంజుల, సర్పంచి లక్ష్మీదేవి చెన్రాయుడు, సూర్యనారాయణ, హరినాథ్, శ్రీధర్, రాము, రాధాకృష్ణ, శేఖర్‌రెడ్డి, పారిశుధ్య కార్మికులు, పాల్గొన్నారు.

నంబులపూలకుంట : స్థానిక కెజిబివి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు స్కూల్ నుంచి బస్టాండ్ వరకూ చెత్త చెదారం తొలగించారు. స్వచ్ఛభారత్ గురించి ప్రజలకి అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. బిసి హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు విద్యార్థులతో కలిసి వైకుంఠ నారాయణ దేవస్థానం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆయుర్వేద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.


హిందూపురంలో అవగాహన ర్యాలీ, మడకశిరలో సిడిపిఒ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ, రొద్దంలో బ్లీచింగ్‌పౌడర్ చల్లుతున్న సిబ్బంది, తనకల్లులో పిచ్చిమొక్కల తొలగింపు, గోరంట్లలోప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నేడు 'స్పందన' రద్దు

పుట్టపర్తి అర్బన్ : కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాల్లో నిర్వహించే 'స్పందన'ను నేడు(సోమవారం) రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదివారం వేర్వేరు ఓ ప్రకటనల్లో తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో 'స్పందన'ను రద్దు చేశామన్నారు.

నేటి దీక్షలకు హాజరవండి

పుట్టపర్తి రూరల్ : మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా నేడు(సోమవారం) టిడిపి అధినేత చంద్రబాబు రాజమండ్రి జైలులో చేపట్టనున్న దీక్షకు మద్దతుగా నారా భువనేశ్వరి దీక్ష చేపట్టనున్నారు. ఆమె దీక్షకు మద్దతుగా నేడు పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సామూహిక రిలే నిరాహార దీక్షల్లో పార్టీ నాయకురాళ్లు, మహిళలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పల్లె రఘునాథ్‌రెడ్డి కోరారు.

బాబా ఆలయానికి బియ్యం వితరణ

ధర్మవరం టౌన్ : గాంధీ జయంతి సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ఆదివారం 'పిటికెడు బియ్యం అనాథలకు సాయం' కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని శివనగర్ కు చెందిన బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు వారి వారి ఇంటి నుంచి పిటికెడు బియ్యం సేకరించారు. ఇలా సేకరించిన 700కు పైగా కిలోల బియ్యాన్ని పాఠశాల కరస్పాండెంట్ సివి శేషు విద్యార్థులతో కలిసి స్థానిక కొత్తపేట షిరిడీ సాయిబాబా ఆలయంలో అందజేశారు. విద్యార్థులు ఇప్పటి నుంచే చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల వైపు దృష్టి సారించడం సంతోషంగా ఉందని కరస్పాండెంట్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేని కలిసిన 'బత్తల'

కదిరి టౌన్ : మాజీ ఎమ్మెల్యే, వైసిపి సీనియర్ నాయకులు డాక్టర్ కడపల మోహన్‌రెడ్డిని ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా. బత్తల హరిప్రసాద్, బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డా. బత్తల వెంకటరమణ మర్యాద పూర్వకంగా కలిశారు. తాజా పరిస్థితులపై చర్చించి దుశ్శాలువాతో సన్మానించారు. వారితో పాటు నాయకులు బహుద్దీన, బాబా, జాకీర్, నరేంద్ర ఉన్నారు.

'ఆరోగ్యాంధ్రప్రదేశ్' సిఎం లక్ష్యం

బత్తలపల్లి : ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సిఎం జగన్ 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జడ్పిటిసి కోటి సుధ పేర్కొన్నారు. 'ఆరోగ్య ఆరోగ్య సురక్ష'లో భాగంగా ఆదివారం స్థానిక ఇందదిరమ్మ కాలనీలో ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పర్యటించగా జడ్పిటిసి వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గౌతమ బుద్ధ హరిత వికాస వృద్ధాశ్రమం, సంక్షేమ కేంద్రంలో ధర్మవరం రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మడకశిర : మండల పరిధిలోని నల్లేకామనహళ్లి సమీపంలో ఆదివారం సాయంకాలం జరిగిన రోడ్డు ప్రమాదంలో నగేష్(31) మృతి చెందాడు. మండల పరిధిలోని జక్కేపల్లి గ్రామానికి చెందిన నగేష్ బెంగళూరులో ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతుండేవాడు. అతడు స్వగ్రామం వస్తుండగా నల్లే కామన పల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కర్నాటక లోని మిడిగేసి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకనే అక్రమ కేసులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రూరల్ మండల పరిధిలోని నిడిమామిడి గ్రామం నుంచి గంటల మారెమ్మ దేవాలయం వరకూ దాదాపు 12 కి.మీ పాదయాత్ర నిర్వహించారు. గ్రామ గ్రామాన వారికి ఘన స్వాగతం లభించింది. పెడబల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక సిఎం జగన్ అడ్డదారుల్లో అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికలలో వైసిపి గాలికి కొట్టుకుపోవడం ఖాయమని, టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్ కుమార్, ఆదినారాయణ రెడ్డి, శ్రీరామ్‌నాయక్, బొమ్మయ్య, శ్రీరామిరెడ్డి, సోమకోటి ఆదినారాయణ, కొత్తచెరువు మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, సాటక్కగారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సైకో పాలనకు చరమ గీతం పాడదాం అని టిడిపికి చెందిన కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల నాయకులు పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా 19వ రోజు చేట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షల్లో కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, ముత్యాలప్పనాయుడు, ఎస్‌ఐసి వెంకటేశ్, అమర్‌నాథ్‌చౌదరి, తుమ్మల జనార్ధన, నాగరాజనాయుడు, కరెంటు ఆది, గంగారపు రవి, అమర సుధాకర్ నాయుడు, రాయపాటి శివ, ఉపేంద్ర, రవి, ఆనందరెడ్డి, హేమంత్, పాల్యం సుబ్రమణ్యం, బత్తల ధనుంజయ, ఆంజనేయులు, మనోహర, రమణ, నాయుడు, తుమ్మల మాదవయ్య కుర్చుకున్నారు.


కొట్నూరు చెరువుల్లో జల దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు

కదిరి టౌన్ : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా, చంద్రబాబుకు పెరుగుతున్న మద్దతు చూసి వైసిపి పునాదులు కదులుతున్నాయని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. 'మేము సైతం బాబు'తో కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 21వ రోజూ కొనసాగాయి. దీక్షకు ఆదివారం నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సంఘం, స్వర్ణకారులు, బంగారు వ్యాపారుల సంఘం సభ్యులు మద్దతు తెలిపారు. కందికుంట మాట్లాడుతూ చంద్రబాబు విడుదలయ్యేంత వరకూ తమ పోరాటాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తూనే ఉంటామని హెచ్చరించారు. చంద్రబాబు అరెస్టు, దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా వాల్మీకి బోయ సంఘం నాయకులు బాణం ఎక్కువ పెట్టి నిరసన గళం వినిపించారు.

ముదిగుబ్బ : టిడిపి ఆధ్వర్యంలో ముదిగుబ్బ 3వ ఎంపిటిసి పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. వారు ప్రజలకు చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని, సైకో పాలనపై వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తుమ్మల మనోహర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు రాధమ్మ, రియాజ్‌బాషా, చికెన్ తిరుపాలు, ఉత్తమనాయుడు, గడ్డం మోహన్, గాజుల చంద్ర, రామయ్య, రంగనాయకులు, నారాయణ స్వామి, సుబ్బారాయుడు, వెంకటపతి, ఆంజనేయులు, క్రిష్ణ, అబ్దుల్ రజాక్, సూరి, నాగులగుబ్బల సూరి, తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్రలో పాల్గొన్న పల్లె, టిడిపి శ్రేణులు

పుట్టపర్తి అర్బన్ : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయం ముందు చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలు 19 రోజుకు చేరుకున్నాయి. పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపికి బలమైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని అంతా చంద్రబాబు వెంట ఉన్నారన్నారు. దీక్షలో నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాలే నాయక్, సామకోటి ఆదినారాయణ, పుల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి, ఐటిడిపి నాయకులు పట్టణంలోని కొట్నూరు చెరువులో జలదీక్ష చేపట్టారు. అంతకుముందు పట్టణంలోని ఎల్‌జి బాలకృష్ణన్ సర్కిల్‌లో దీక్ష చేపట్టి సిఎం జగన్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదాలు చేశారు. దీక్షలో నాయకులు అంబికా లక్ష్మినారాయణ, రమేష్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు విడుదయ్యే వరకూ శాంతియుతంగా నిరసన పోరాటాలను కొనసాగిస్తామన్నారు.

కళ్యాణమండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని కాల్వేపల్లి గ్రామంలో లక్ష్మీరంగనాథస్వామి ధర్మ ప్రచార సేవా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి ఆదివారం గుడిబండ మండలం తిమ్మాలాపురం గ్రామానికి చెందిన రంజిత పాణ్ణే రాఘవేంద్ర కుటుంబ సభ్యులు(కాల్వేపల్లి రాజన్న మాజీ ఎంపిటిసి కుమార్తె) రూ. 50వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజన్న, శ్రీరంగప్ప ఎస్.తిమ్మప్ప, బండి రమేష్, బండి రంగనాథ్, ఎం.తిమ్మప్ప, రంగనాథ్, రాకేష్, రంగనాథప్ప, రఘు పాల్గొన్నారు.


కళ్యాణ మండపానికి అందజేస్తున్న దాతలు

గుండెజబ్బులపై అవగాహన అవసరం

ధర్మవరం టౌన్ : ప్రతి ఒక్కరికీ గుండె జబ్బులపై అవగాహన అవసరమని స్పందన హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ టిఎం. బషీర్, డాక్టర్ వై.సోనియా తెలిపారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆదివారం స్పందన ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 56 మందికి గుండె చికిత్స చేసి సలహాలు ఇచ్చారు. శిబిరంలో హాస్పిటల్ మేనేజర్ బాబాఫకృద్దీన్, దిల్దార్, భవాని, సువర్ణ, వాణి, తేజ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పట్టణంలోని స్వచ్ఛంధ సంస్థలైన రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, రక్తబంధం ఆర్గనైజేషన్, విశ్వదీప సేవా సంఘం, శ్రీచౌడేశ్వరీదేవి సేవా సమితి, యువర్స్ ఫౌండేషన్, ఆదర్శ సేవా సంఘాల సహాయ, సహకారంతో నరసింహులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి దాతలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. శిబిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ నరసింహులు, కార్యదర్శి శివయ్య, కోశాధికారి సత్యనిర్ధారన్, చిన్నపరెడ్డి, పోలా ప్రభాకర్, నరేందర్‌రెడ్డి, శివయ్య, కొండయ్య, రత్నశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, జయచంద్ర, జయశ్రీ, వెంకటేష్, శ్రీరాములు, ప్రసాద్, శివయ్య, నాగరాజు, కృష్ణమూర్తి, కె.చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడితే సహించేది లేదు

హిందూపురం : నియోజకవర్గంలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే సహించేది లేదని వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదివారం సిఐ శ్రీనివాసులుతో కలిసి పట్టణంలో పర్యటించి మటన్ వ్యాపారులను కలిసి అండగా మేము, ప్రభుత్వం ఉంటుందని భరోసా కల్పించారు. హిందూపురం శాంతికి మారు పేరని, ఎక్కడో జరిగిన సంఘటనలను ఇక్కడ ప్రస్తావించి, మత విద్వేషాలను రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. ఆయనతో పాటు చాంద్‌బాషా, ఫరూఖ్, తదితరులు ఉన్నారు.

ఎంపి మిథున్‌రెడ్డిని కలిసిన సాదత్

కదిరి టౌన్ : లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఆదివారం కదిరి వైసిపి నాయకులు కె.సాదత్ అలీఖాన్ తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకం గా కలిశారు. కదిరి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితిపై సాదత్, మిథున్‌రెడ్డి చర్చించినట్లు తెలిపారు.

రైతు రక్షణ వేదిక కన్వీనర్ రమణ జనసేనలో చేరిక

కదిరి టౌన్ : పట్టణానికి చెందిన రైతు రక్షణ వేదిక కన్వీనర్, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు తమ్మిశెట్టి వెంకటరమణ ఆదివారం అనంతపురం నగరంలో పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, పిఎసి సభ్యులు చిలకం మధుసూదన్‌రెడ్డి, భవానీ రవికుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. రమణ మాట్లాడు తూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలు, ఆలోచనా విధానాలు నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలనను అంతమొందించేందుకు పవన్ కళ్యాణ్ వెంట నడుస్తూ, పార్టీని అన్ని వర్గాల ప్రజల్లోకి తీసుకెళ్లి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కదిరి ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, పాల్గొన్నారు.

'కుశలవ' యాజమాన్యంపై ఫిర్యాదు

లేపాక్షి : మండల పరిధిలోని కొండూరు గ్రామ పొలంలో ఇటీవల కెవిపిఎస్, సిపిఎం ఆధ్వర్యంలో నాటిన జెండా లను తొలగించిన 'కుశలవ' యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని కోరుతూ సిపిఎం, కెవిపిఎస్ నాయకులు ఎస్ఐ మునీర్ అహమ్మద్‌కి ఆదివారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కుశలవ యాజమాన్యంపై వెంటనే కేసు నమోదు చేయాలని, లేని పక్షంలో ఉద్యమం చేపడుతామన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, అన్నమయ్య, రామంజి, గోపాల్, నరసింహప్ప, గంగాధరప్ప,



ఎస్ఐ మునీర్ అహమ్మద్‌కి ఫిర్యాదు చేస్తున్న కెవిపిఎస్ నాయకులు